సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం ၊ 14 ၊ అక్టోబర్ ၊ 2023



మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కలిసికట్టుగా పని చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. పీలేరులో మాదక ద్రవ్యాల వాడకం ఉన్నట్లు తెలుస్తోందని -10లో



భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు

రాయచోటిలోని భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 211 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	501	501
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 30.100 కిలోలు

న్యూస్‌రీల్

తలనీలాల వేలం వాయిదా



శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

సిద్దవటం: లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు స్వామి వారికి సమర్పించుకునే తలనీలాల వేలం పాటను వాయిదా వేసినట్లు ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం తలనీలాల వేలంపాట రూ. 2,30,000 పలికిందన్నారు. శుక్రవారం రంగనాయక స్వామి ఆలయంలో వేలం నిర్వహించగా రూ.2,06000 వరకు వేలం పాడంటంతో వాయిదా వేశామని చెప్పారు. కార్యక్రమంలో కడప దేవాదాయశాఖ ఈఓ ఎ. శ్రీనివాసులు, ఆలయం చైర్మన్ కొండారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

116 మందికి పీజీటీలుగా పదోన్నతి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 116 మందికి ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టిజిటి) నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పిజిటి)గా పదోన్నతి కల్పించినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కడపలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో జోన్-4 పరిధిలో పనిచేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించేందుకు కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన నియామకం



గుండ్లకుంట శ్రీరాములు



షేక్ అల్లా బకాష్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ వైఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడిగా గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా షేక్ అల్లా బకాష్‌ను నియమించింది. రాష్ట్ర కమిటీలోనూ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్ అహ్మద్, బండి జకరయ్యను నియమించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సాయికుమార్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాజంపేట టౌన్: పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 28వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రాజంపేట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎం.సాయికుమార్ నాయక్ ఎంపికైనట్లు హెచ్‌ఎం.రవికుమార్, పీఈటీ సుశీల తెలిపారు. కడపలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 యోగా పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

రాజంపేట రూరల్: అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేట్టాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సీజనల్, అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం జనార్ధనరెడ్డి మాట్లాడుతూ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్, వార్డు ఆరోగ్య కార్యదర్శులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పి.శేషఫణి, అసిస్టెంట్ ఇంజినీర్ జీ. మల్లేశుడు, సబ్ యూనిట్ అధికారి ఎస్ ఎస్‌దాస్, మెడికల్ ఆఫీసర్లు ఎస్ మస్తానీ, అశోక్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేవీ పూజకు వేళాయె

తెలుగు వారు పది రోజులపాటు అట్టహాసంగా నిర్వహించే దసరా వేడుకలు, పూజల గురించి అనుకుంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో వెంటనే గుర్తుకు వచ్చేది పినాకిని నది ఒడ్డున ఉన్న కన్యకా పరమేశ్వరీ దేవాలయం. మైసూరు తర్వాత అంతటి ప్రఖ్యాతిగాంచిన ప్రొద్దుటూరు ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమైంది.

- 15 నుంచి వైభవంగా దసరా ఉత్సవాలు
- నాగపూర్ కళాకారులతో సుహాగ్ బ్యాండ్
- విజయదశమి రోజున బిందెసేవ, శక్తి వేషాలు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఆర్య వైశ్య సభ ఆధ్వర్యంలో ఏడాదికేడాది విజయ దశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అన్ని కులాలు, మతాల భక్తులు తరలివస్తారు. గ్రానైట్ రాయితో ఆలయం గర్భగుడి మనోహరంగా తీర్చిదిద్దారు. మూల విరాట్‌ను పుత్తడి ఆభరణాలు, వజ్రపు చీర, వజ్ర కిరీటం, బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. గర్భగుడికి వెండి తొడుగులను అమర్చడమేగాక, అమ్మవారికి బంగారంతో చేసిన రథం, వెండి ఊయల, అద్దాల మండపం ఏర్పాటు చేస్తారు. దేవీ జన్మ వృత్తాంతం తెలిపే చిత్రపటాలు దర్శనమిస్తాయి.

ఆలయ చరిత్ర: 1890లో నిర్మించిన ఈ ఆలయంలో ఎత్తైన గాలి గోపురం, చక్కని శిల్పకళా నైపుణ్యంతో పట్టణానికి శోభ చేకూర్చే విధంగా గాలి గోపురం దర్శనమిస్తాయి. అపురూపమైన శిల్ప సంపద కలిగిన ముఖద్వార మండపం మనోహరమైన దృశ్యాల సమ్మేళనం. పర్లపాడు గ్రామానికి చెందిన వ్యాపారి కామిశెట్టి చిన్న కొండయ్యకు కలలో కనిపించిన కన్యకా పరమేశ్వరి ''పెనుగొండ వాసినైన నేను కడప జిల్లా పినాకిని నదికి ఉత్తర దిక్కున ఉన్న ప్రొద్దుటూరు పట్టణంలో కొలువు తీరనున్నా.. నాకు ఆలయం నిర్మించాలి' అని చెప్పడంతో 130 ఏళ్ల కిందట వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నిర్మించారు. 1895 నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. 1929లో జాతిపిత మహాత్మా గాంధీ ఈ ఆలయాన్ని సందర్శించినట్లు చెబుతారు. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతిలు ఆలయంలో 40 రోజుల పాటు యజ్ఞయాగాదులు నిర్వహించారు.

133వ దసరా ఉత్సవాలు: కన్యకా పరమేశ్వరి ఆలయంలో 133వ శరన్నవరాత్రి వేడుకలను 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. నవరాత్రుల్లో ఒక్కో రోజున ఒక్కో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.



ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల (ఇన్‌సెట్) వజ్రపు చీర అలంకరణలో అమ్మవారు

అలంకారాలు
15న రాజరాజేశ్వరిదేవి
16న భవానిదేవి
17న అన్నపూర్ణాదేవి
18న గాజులక్ష్మీదేవి
19న పార్వతీదేవి
20న సరస్వతీదేవి
21న గాయత్రీదేవి
22న మహిషాసురమర్దిని
23న విజయలక్ష్మి
24న వసంతోత్సవం

వైభవంగా దసరా ఉత్సవాలు



ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో 133వ దసరా ఉత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం తెలిపారు. అమ్మవారి శాలలో ఉత్సవ ఆహ్వాన పత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రోజూ లోక కల్యాణార్థం చతుర్వేద పారాయణం, జప హోమాలు, విశేష అభిషేకాలు, అర్చన, బంగారు శ్రీచక్రానికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 102 మంది అమ్మవారిశాల నుంచి శివాలయం చేరుకుని నవగంగతీర్థాలు, నగరేశ్వరస్వామి ఆలయం నుంచి వాసవీపురాణాన్ని తీసుకువచ్చే వేడుక ఉంటుందన్నారు. నాగ్‌పూర్‌కు చెందిన 40 మంది కళాకారులతో సుహాగ్ బ్యాండ్ ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కలకత్తా తరహాలో ప్రత్యేక పందిరి ఏర్పాటు చేశామన్నారు. కదిలే ఆంజనేయ స్వామి బొమ్మల సెట్టింగ్, బిందెసేవ రోజు కేరళ వారిచే శక్తివేషాలు, చక్కభజన, రేలారే రేలా, తొట్టిమెరవణికి స్పెషల్‌గా క్రాకర్స్ భక్తులను ఆకట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రవీంద్రబాబు, మిట్టా శంకర్‌బాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్‌తో కలిసి శుక్రవారం ఆలయ ప్రొద్దుటూరులో ఎస్పీ విస్తృతంగా పర్యటించారు. అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, కొర్రపాడు రోడ్డులోని జమ్మి చెట్టు, ఎగ్జిబిషన్ ప్రాంతాలను సందర్శించారు. పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శివాలయం సెంటర్‌లో సూచనలిస్తున్న ఎస్పీ

16 నుంచి ఈవీఎంల పరిశీలన: కలెక్టర్ గిరీషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఈ నెల 16వ తేదీ నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి విడత పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ యంత్రాల మొదటి విడత పరిశీలన(ఎఫ్ఎల్‌సీ)లో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి దాదాపు 20 రోజుల పాటు ఓటింగ్ యంత్రాల పరిశీలన కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో చిన్న తప్పు జరగడానికి వీలు లేదన్నారు. రాయచోటి పట్టణంలో మార్కెట్‌యార్డులోని ఈవీఎం గోడౌన్లలో నిర్వహించే ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ కోసం అవసరమైన సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్, పటిష్ట పోలీసు బందోబస్తు, కంట్రోల్ రూమ్ తదితర ఏర్పాట్లను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. చెకింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదన్నారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున ఏడు మందికి సంబంధించిన ఫోటోలు ఆథరైజేషన్ లెటర్ వెంటనే ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపుకార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. పరిశీలన హాల్లోకి వచ్చేవారు తప్పక గుర్తింపుకార్డుతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి

అధికారులకు సీఎండీ సంతోషరావు ఆదేశం

రాయచోటి అర్బన్: విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ పడొద్దని దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండి అన్నారు. పేరుకుపోయిన బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో రాయచోటి డివిజన్ పరిధిలోని సుండుపల్లె, రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతాంగానికి ఎదురయ్యే విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరును యుద్ధప్రాతిపకద చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుండి విద్యుత్‌కు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ అభివృద్ధి పనులలో నాణ్యతాప్రమాణాలను పాటించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య, ఓఎస్‌డి శ్రీనివాసులు, వైఎస్‌ఆర్ జిల్లా ఎస్ఈ ఎస్.రమణ, అకౌంట్స్ ఆఫీసర్ మధు, రాయచోటి డివిజన్ ఈఈ చంద్ర శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండి సంతోషరావు

చేనేత కార్మికుల కళా నైపుణ్యం భేష్

- మదనపల్లెలో ఇన్వెస్ట్ ఇండియా బృందం పర్యటన
- ఓడీఓపీ కింద నీరుగట్టువారిపల్లె చీరల పరిశీలన

మదనపల్లె : అన్నమయ్యజిల్లా మదనపల్లె నీరుగట్టువారిపల్లె చేనేత కార్మికుల కళా నైపుణ్యం భేష్ అని, మగువల మనస్సును కట్టిపడేసేలా, చూడగానే ఆకట్టుకునేలా చీరలను తయారుచేయడంలో వారి కృషి అభినందనీయమని ఢిల్లీకి చెందిన ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి ఆరాధన అన్నారు. వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రోడక్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు సంబంధించి మదనపల్లె పట్టుచీరను అవార్డు కోసం జిల్లా చేనేత, జౌళిశాఖ నామినేట్ చేసిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు శనివారం మదనపల్లెలో పర్యటించారు. కొత్తవారిపల్లెలో మల్బరీతోటలను పరిశీలించారు. కోళ్లబైలులో చేనేతకార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి ఆరాధన మాట్లాడుతూ.. మదనపల్లె పట్టుచీర నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించామని, ఉత్పత్తులు మంచిగా ఉన్నాయని, వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రోడక్ట్ కింద ఎంపిక చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదికను, అధికారులు సమర్పించిన నామినేషన్ పత్రాలను కేంద్రప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. మదనపల్లె చీర వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రోడక్ట్‌కు తప్పకుండా ఎంపికవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీకి చెందిన కేంద్రబృందం సభ్యులు నీరుగట్టువారిపల్లెకు వచ్చిన సందర్భంగా వారితో జరిగిన ముఖాముఖిలో పలువురు చేనేతకార్మికులు, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పవర్‌లూమ్స్ కారణంగా హ్యాండ్‌లూమ్స్ నష్టపోతున్నాయని తెలిపారు. చేనేతకార్మికులు నాణ్యమైన చీరలను ఉత్పత్తిచేస్తున్నా..నిరక్షరాస్యత, మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన ఫలితాలను పొందలేకపోతున్నామని వివరించారు. 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలుజరిపి, ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి చేనేతకార్మికులకు అమలవుతున్న పథకాలు తమకు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ ఆర్‌డీడీ జి.రాజారావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి, సిరికల్చర్ ఏడీ రామ్మోహన్, సరోజమ్మ, చేనేతసంఘాల నాయకులు నాగరాజు, అవ్వారుమల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యురాలు ఆరాధన, అధికారులు

టెర్రకోటలో నవశకం

- టెక్నాలజీ బాటలో హస్త కళాకారులు
- రూ.43.5 లక్షలతో అంగళ్లు సీఎఫ్‌సీలో ఆధునిక యంత్రాలు
- బంక మట్టికి ఇక కొత్త మెరుపు
- ఢిల్లీ, కలకత్తా, గుజరాత్ తరహా బొమ్మలు ఇక ఇక్కడే తయారీ



కురబలకోట: బంకమట్టితో చేసే టెర్రకోట బొమ్మలు, కుండలకు దేశ విదేశాల్లో ఆదరణ ఉంది. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని అంగళ్లు, కంటేవారిపల్లె, పలమనేరు, రాయచోటి తదితర ప్రాంతాలు వీటికి రాష్ట్రంలోనే ప్రసిద్ధి. సీఎఫ్‌సీ సెంటర్లు కూడా ఏర్పాటు చేశారు. 30 ఏళ్లుగా టెర్రకోట కళ ప్రాచుర్యంలో ఉంది. టెర్రకోట హస్త కళాకారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం నుంచి ఆధునిక యంత్రాలను ఉచితంగా ఇచ్చి అండగా నిలిచాయి. ఇప్పుడు హస్తకళాభివృద్ధి సంస్థ ద్వారా రూ. 43.5 లక్షలతో బాల్ మిల్, బ్లంజర్, ఫిల్టర్ మిషన్ వివిధ సరికొత్త మిషన్లను అంగళ్లు సీఎఫ్‌సీలో ఏర్పాటు చేశారు. బంకమట్టిలోని వేస్టేజిని తొలగించి నునుపైన మట్టిని అందిస్తాయి. కష్టమైన పనిని కూడా సులభంగా చేసుకునేలా అవసరమైన ఆధునిక యంత్రాలను సమకూర్చింది. కురబలకోట, కంటేవారిపల్లె చుట్టుపక్కల ప్రాంతాల వారికి కొత్త సాంకేతిక పద్ధతులపై తర్ఫీదు ఇవ్వనున్నారు. వారిలో సరికొత్త ఉత్సాహం, పనితనం పెంచనున్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి టెర్రకోట కళాకారుల అభివృద్ధికి కొత్త బాటలు వేస్తున్నారు. ఇతోధికంగా తోడ్పాటునిస్తున్నారు. టెర్రకోట బొమ్మలను బెంగళూరు, హైదరాబాదు, తెలంగాణా, చెన్నై, కేరళ, విజయవాడ తదితర ప్రాంతాల్లో మార్కెటింగ్ చేస్తున్నారు. ఎగ్జిబిషన్ల ద్వారా కూడా క్రయ విక్రయాలు చేస్తున్నారు. బొమ్మలు,కుండలకే కాకుండా మట్టి వంట పాత్రలకు కూడా ఆదరణ లభిస్తోంది.అధునాతన యంత్రాలు సమకూర్చడం ఆనందంగా ఉందని టెర్రకోట కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రంగంలో టెక్నాలజీ పెరుగుతోంది. టెర్రకోటలో కూడా చోటుచేసుకుంది. రాయిలో శిల్పం దాగి ఉంటుంది. అదే విధంగా బంకమట్టిలో కూడా అందమైన కళాకృతులు ఉన్నాయని వీరు నిరూపిస్తూ చేయి తిరిగిన కళాకారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. హస్త కళలకు చరిత్రలో ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇవి అనాదిగా ప్రజల జీవన విధానంతో ముడిపడిసాగుతున్నాయి. ఏడాదికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.8 కోట్లు దాకా టర్నోవర్ ఉంటోంది.



అంగళ్లు సీఎఫ్‌సీ సెంటర్‌లో కొత్తగా అమర్చిన అత్యాధునిక యంత్రాలు


సమయం ఆదా



కొత్త మిషన్లతో సమయం ఆదా అవుతుంది. మరింత మెరుగ్గా పనులు చేసుకోవచ్చు. నైపుణ్యానికి పదును పెట్టొచ్చు. కరోనా ప్రభావంతో ఆరోగ్యం స్పృహ పెరిగింది. నీళ్ల బాటిళ్లు, మట్టి కూజాలు, పెనాలు, గ్లాసులు, టీ కప్పులు, మగ్గులు, ప్రమిదలు లాంటి మట్టిపాత్రలకు విశేష ఆదరణ లభిస్తోంది. కొత్త మిషన్లతో ఇవి మరింత నునుపుగా, నాణ్యతగా తయారు చేసుకోవచ్చు. డీఆర్‌డీఏ ఎప్పటికప్పుడు వెంట నడుస్తూ ప్రోత్సహిస్తోంది. ఏడాదికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.8 కోట్ల దాకా టర్నోవర్ ఉంటోంది.

–వెంకట్రమణమ్మ, టెర్రకోట కళాకారిణి, అంగళ్లు, కురబలకోట మండలం


విదేశాల ఎగుమతికి అవకాశం



టెర్రకోట కళను ప్రోత్సహించి వారి బతుకు దెరువుకు కొత్త బాటలు వేస్తున్నారు. ఆధునిక యంత్రాల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా టెర్రకోటకు గుర్తింపు రానుంది. ఎగుమతులకు అనుమతి లభిస్తుంది. ప్రపంచ మార్కెట్‌ను ప్రభావితం చేస్తుంది. తద్వారా హస్త కళాకారుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. ఈ కళ కళాకారులకు గుర్తింపు గౌరవం కూడా లభిస్తుంది.

–వాణి, టెర్రకోట హస్త కళాకారిణి, అంగళ్లు, కురబలకోట మండలం


ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి



చేతి వృత్తులపై ఆధారపడిన వాళ్లు ఆర్థికంగా ఎదగాలనేదే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆశయం. కాలానుగుణంగా వస్తున్న మార్పులపై హస్త కళాభివృద్ధి సంస్థ రూపకల్పన చేస్తోంది. కొత్త మిషన్లు, పరికరాలతో కష్టాన్ని తగ్గించి చేయూతను ఇస్తున్నారు. నైపుణ్యం పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. నైపుణ్యాలే జీవనానికి బలమైన పునాదులు. ఢిల్లీ, కలకత్తా, గుజరాత్ తరహా బొమ్మలు, కుండలు ఇక్కడే తయారు చేయచ్చు.

–రాజగోపాల్, టెర్రకోట హస్త కళ రాష్ట్ర అవార్డు గ్రహీత, అంగళ్లు, కురబలకోట మండలం


శారీరక శ్రమ తగ్గింది



కుమ్మరులంటే ఇదివరలో చక్రం (సారె)పై మట్టి వేసి కట్టె తిప్పుతూ కుండలు, బొమ్మలు చేసేవారు. ఇప్పుడు ఆపద్ధతి లేదు. పాత విధానాలకు 15 ఏళ్లకు ముందే స్వస్తి పలికారు. ఇప్పుడంతా మట్టిని ఎలక్ట్రికల్ వీల్ మిషన్ ద్వారా సిద్ధం చేసుకుంటున్నారు. అదే విధంగా బంకమట్టిని కాళ్లతో తొక్కేపని లేకుండా ప్లగ్ మిల్ మిక్సర్ మిషన్ ద్వారా కానిస్తున్నారు. బాల్‌మిల్, కట్టర్లు, ఫిల్టర్లు తదితర అదునిక మిషన్లతోనే పనులు సులభమవుతున్నాయి. కుమ్మరి చక్రాలు పోయి ఆధునిక మిషన్లు చేతి కష్టాన్ని శారీరక శ్రమను తగ్గించాయి.

–దుర్గం మల్లికార్జున, టెర్రకోట యూనియన్ లీడర్, అంగళ్లు

కష్టం తగ్గుతుంది



పదిరోజుల్లో చేసేపనిని ఈ మిషన్లతో మూడు రోజుల్లో చేయచ్చు. ఇదివరలో మట్టిని కాళ్లతో తొక్కి మిషన్‌లో వేసి ముడి మట్టిని తయారు చేసుకోవాల్సి వచ్చేది. కొత్త మిషన్లతో ప్రయాస లేదు. మిషన్‌లోనే మట్టి నునుపుగా తయారై వస్తుంది. వేస్టేజి వెళ్లిపోతుంది. కుండలు, బొమ్మలు చేసుకోవచ్చు. కష్టం తగ్గుతుంది. ఇదివరకే విడతల వారీగా శిక్షణలు కూడా ఇచ్చారు. కొత్త మిషన్ల నిర్వహణపై కూడా శిక్షణ ఇస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1650 కుటుంబాలకు పైగా ఈ వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయి.

–డి. వెంకట్రామయ్య, హస్తకళాకారుడు, అంగళ్లు

స్థానిక సమస్యలు సత్వరం పరిష్కరించండి

- ప్రజల అర్జీలపై సత్వరం స్పందించాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పుల్లంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం స్థానిక సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపేందుకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పుల్లంపేటలో నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శుక్రవారం పుల్లంపేట మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ రామకృష్ణారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మండల కేంద్రానికి వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. పారదర్శకంగా ప్రజలకు పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1902కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్డీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రం, మండల కేంద్రాలలో నాలుగు సంవత్సరాలుగా స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, ప్రజల సమస్యలు మండల స్థాయిలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ పార్టీ వారికే పనులు జరిగేవని, ప్రస్తుత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా క్రీడలలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, మడగలం శ్రీనివాసులు, కుమార్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆలం చెంగయ్య, దొండ్లోపల్లి మణి, జిల్లాస్వాయి, మండలస్థాయి అధికారులు, పుల్లంపేట తహసీల్దార్ నరసింహకుమార్, ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, గుంటిమడుగు సుధాకర్ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు దోపిడీ ప్రజలకు తెలియజేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అధికారాన్ని ఉపయోగించుకుని చేసిన అవినీతి, అక్రమాలు, దోపిడీ తెలియజేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మండల సచివాలయ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారాన్ని అడ్డంపెట్టుకుని చంద్రబాబు చేసిన మోసాలు, అక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఏ విధంగా మోసం చేశాడో వివరించాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చెప్పాలన్నారు. అప్పటికీ, ఇప్పటికీ ఉన్న తేడాను ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట సాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ఎల్వీ మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లు ప్రశాంతి రమేష్, ముజీబ్, సుధాకర్‌రాజు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్ బౌన్స్ కేసులో జైలు

రాయచోటిటౌన్ : చెక్ బౌన్స్ కేసులో సంబేపల్లె మండలం దిగురాజుగారిపల్లెకు చెందిన యువవాణి (23) అనే మహిళకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడిషల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శారద తీర్పు తీర్పు చెప్పారని రాయచోటి పోలీసులు తెలిపారు. శుక్రవారం రాయచోటి కోర్టులో జరిగిన ఇరువురి వాదనలు విన్న తరువాత జడ్జి ఈ తీర్పును వెలువరించినట్లు పేర్కొన్నారు. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం చెంచురెడ్డిగారిపల్లెకు చెందిన కోటకొండశంకర్ వద్ద సంబేపల్లె మండలం దిగురాజుపల్లెకు చెందిన యువవాణి 2017 మే 15 నుంచి 2017 జూలై 3 మధ్య తేదీలలో మొత్తం రూ.3,5 లక్షలు అప్పుగా తీసుకొని నెలలోపు ఇస్తానని చెప్పింది. అయితే ఆమె ఆయనకు మూడు చెక్కులు ఇచ్చింది. చెక్కులకు తగినంత డబ్బులు అకౌంట్లో జమ చేయకపోవడంతో బౌన్స్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

3 ఇసుక ట్రాక్టర్‌లు సీజ్


ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్‌లు

ఒంటిమిట్ట(సిద్దవటం) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను శుక్రవారం సీజ్ చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో పోలీసు స్టేషన్ సీఐ ఉరుకుందమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం దర్జీపల్లె గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని తమకు సమాచారం రావడంతో.. సిబ్బందితో వెళ్లి దాడులు జరిపి మూడు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పెన్నపేరూరు గ్రామానికి చెందిన డి.ఆశీర్వాదం ట్రాక్టర్ ఇప్పటికి రెండు సార్లు పట్టుపడటంతో రూ.20 వేలు జరిమానా వేశామన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన కదిరి రామయ్య ట్రాక్టర్ మొదటి సారి పట్టుపడటంతో రూ. 10 వేలు జరిమానా విధించామన్నారు. నరవకాటిపల్లె గ్రామానికి చెందిన శివ ట్రాక్టర్ రెండు సార్లు పట్టుబడటంతో రూ.20 వేలు జరిమానా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ పురుషోత్తంబాబు, హెడ్ కానిస్టేబుళ్లు బాలఏసు, ఎం.జి.మోహన్‌రెడ్డి, పోలీసులు పి.చంద్రశేఖర్, విజయ్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 8 మందికి జరిమానా

– మరొకరికి మూడు రోజులు జైలుశిక్ష

రాయచోటి : డ్రంకన్ డ్రైవ్ కేసులో 8 మందికి కలిపి రూ.10,500 జరిమానా, మరొకరికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ రాయచోటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ కె.శారద తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా పోలీస్ అధికారులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిపై కేసులను నమోదు చేయాలన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టుల ముందు హాజరు పరిచి జైలు శిక్ష లేదా జరిమానాలు విధించేలా చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతే వారిపై ఆధారపడ్డ కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పేర్కొన్నారు. యువత మద్యం మత్తులో వాహనాలు నడిపి విలువైన ప్రాణాలు బలి చేసుకోవద్దని ఎస్పీ హితవు పలికారు.

మాదక ద్రవ్యాలను కలిసికట్టుగా నిర్మూలిద్దాం

- వీలేరులో కనిపిస్తున్న ఆనవాళ్లు
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా ఎస్పీ కృష్ణారావు


మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్, చిత్రంలో ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : మాదక ద్రవ్యాల నిర్మూలనకు కలిసికట్టుగా పని చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫిరెన్సు హాల్‌లో జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి అటవీశాఖ, విద్య, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వీలేరులో మాదక ద్రవ్యాల వాడకం ఉన్నట్లు తెలుస్తోందని, దానిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్పీని కోరారు. కనిపిస్తున్న ఆనవాళ్లపై కఠిన చర్యలు చేపట్టకపోతే అరికట్టడం సాధ్యం కాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధకానికి వైద్యశాఖ చేపట్టిన కార్యక్రమాల మీద ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేసి చూపించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల వాడకానికి వ్యసనపరులైన వారు ముందుగా వైద్యుల దగ్గరికి వస్తారని, వారికి తగిన సమాచారం ఉంటుందన్నారు. అటువంటి సమాచారాన్ని రికార్డు చేసి చూపించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో వాడుతున్న మాదక ద్రవ్యాలు ఏవి, అవి ఎక్కడ అమ్ముతున్నారో తనిఖీ చేసి తెలుసుకోవాలని జిల్లా డ్రగ్స్ అధికారిని ఆదేశించారు.

కళాశాలలపై కన్నేయ్యాలి

జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. ఆ కమిటీల పనితీరుపై ప్రతినెల పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని కోణాలలో కఠిన చర్యలు చేపడుతున్నామని కలెక్టర్‌కు వివరించారు. పోలీస్, రెవెన్యూ, అటవీ, వైద్య, ఏపీఎస్ఆర్టీసీ తదితర అన్నిశాఖల సమన్వయంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని ఎస్పీ తెలిపారు. రాజంపేట, మదనపల్లి, రాయచోటి డివిజన్ల వారిగా పోలీసుశాఖ వారు తీసుకుంటున్న చర్యలు గురించి కలెక్టర్‌కు వివరించారు.

టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు

మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలన కోసం 14500, 7382296118 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ఎవరు ట్రోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించినా వారి పేర్లను బయటకు తెలియజేయబోమన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు మరింత కఠిన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు, విద్య, వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్

బి.కొత్తకోట : క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ అన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాకాలు అందించి అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడా కార్యక్రమాలు, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులను కోరారు. ఈ పోటీల్లో డబుల్స్‌లో చిత్తూరు నుంచి 10, పలమనేరు నుంచి ఐదు, పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల నుంచి ఐదు, బి.కొత్తకోట నుంచి 20 జట్లు పోటీలో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కె.మంజునాథ్, చింతల రామాంజి, రమేష్‌నాయుడు, మహేష్, చంద్ర, సంతోష్, బాలాజి, ఆది పాల్గొన్నారు.

భార్యను చంపిన కేసులో భర్తకు జీవితఖైదు


ఖైదీని సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె : భార్యపై అనుమానంతో హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు పడింది. ఈ మేరకు మదనపల్లె రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి బి.అబ్రహం తీర్పు చెప్పారని డీఎస్పీ కేశప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామసముద్రం మండలం దిగువబొంపల్లెకు చెందిన రాసింటి కదిరప్ప, కదిరమ్మల కుమార్తె రెడ్డెమ్మను మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ టీకుల పాళెంకు చెందిన మల్లయ్య కుమారుడు విశ్వనాథ(35)కు ఇచ్చి వివాహం చేశారు. వివాహానంతరం మదనపల్లెలో కాపురం ఉంటూ రెడ్డెమ్మ ఇళ్లలో పనిమనిషిగా, విశ్వనాథ టీషాపులో పని చేసుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో విశ్వనాథ తన భార్య రెడ్డెమ్మపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో 2015 డిసెంబర్ 15న రెడ్డెమ్మను గొంతు నులిమి, కిరాతకంగా హత్య చేసి మల్రికుంట చెరువులో పడేశాడు. ఈ ఘటనపై రామసముద్రం పోలీసులు కేసుగా నమోదు చేసి విచారణ చేశారు. విశ్వనాథ భార్యను హత్య చేసినట్లుగా దర్యాప్తులో తేలడంతో అదే నెల 21న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మదనపల్లె రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి అబ్రహాం ఈ కేసు తుది విచారణ అనంతరం తీర్పును వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సీఐ శివాంజనేయులు, ఎస్ఐ చంద్రశేఖర్, కోర్టు కానిస్టేబుల్ రుద్ర విశేష కృషి చేశారు. నిందితుడికి శిక్ష పడేలా అడిషనల్ పబ్లిక్ ప్రాస్యికూటర్-2 జనార్ధనరెడ్డి వాదించారు. మహిళలపై జరిగిన నేరాల్లో త్వరితగతిన నిందితులకు శిక్షలు పడాలన్న డీజీపీ ఆదేశాల మేరకు, ఎస్పీ ఉత్తర్వులతో కోర్టు ట్రయల్స్‌ను వేగంగా పూర్తి చేయిస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన జగపతిబాబు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణం బీకే.పల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన నాగేశ్వరరావు కుమారుడు జగపతిబాబు(30) వ్యక్తిగత పనులపై శుక్రవారం ఉదయం నిమ్మనపల్లెకు వెళుతుండగా, ఎగువమాచిరెడ్డిగారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని కిందపడ్డాడు. ప్రమాదంలో జగపతిబాబు తీవ్రంగా గాయపడగా, 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ రెడ్డిగానిపల్లెకు చెందిన లక్ష్మీదేవి(30) తాము ఉంటున్న వీధిలోని అంగడికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, మరో వ్యక్తి ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రహదారి కోసం ఘర్షణ

గాలివీడు : మండల పరిధిలోని కొర్లకుంట గ్రామం ఎగువతూపల్లె, దిగువతూపల్లెకు చెందిన వారు రహదారి కోసం ఘర్షణకు దిగిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎల్.అమరావతమ్మకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు మరో వర్గంపై మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంటకశివకుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రామసముద్రం మండలంలో జరిగింది. నడింపల్లెకు చెందిన నారాయణస్వామి కుమారుడు సి.రామచంద్ర(27) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం


పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండటంతో సీఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. దీంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు రైల్వేకోడూరు జాతీయ రహదారిపై గుంపులుగా ఏర్పడి విజిల్స్ వేస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించి ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించారని పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసిన కస్తూరి విశ్వనాథనాయుడు, ఆయన అనుచర టీడీపీ నాయకులు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సాయంతో స్వస్థలానికి జిల్లా వాసి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీ ఎన్ఆర్‌జీఎస్) సహకారంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన బొగ్గిడి చిన్నపరెడ్డి సురక్షితంగా స్వస్థలానికి చేరాడు. ఏపీ ఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దవటం మండలం మాధవరానికి చెందిన బొగ్గిడి చిన్నపరెడ్డి ఒకటిన్నర ఏడాది కిందట డ్రైవర్ పని నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. మూడు నెలలుగా అతను కిడ్నీ సమస్యతో బాధపడుతుండేవాడు. తనకున్న అనారోగ్య సమస్య నయం చేయాలని స్పాన్సర్‌కు ఎన్నిమార్లు చెప్పినా ఆస్పత్రికి కూడా పంపకుండా వేధించాడు. దీంతో సమస్య తీవ్రమై ఇబ్బంది పడిన చిన్నపరెడ్డి తనను స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని మాధవరానికి చెందిన పల్లె సుబ్బరామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ మహేష్‌రెడ్డి ద్వారా చిన్నపరెడ్డిని ఎంబసీకి తీసుకెళ్లి వారి సాయంతో లేబర్ కోర్టు ద్వారా స్పాన్సర్ వద్దనుంచి పాస్‌పోర్టు ఇప్పించారు. చిన్నపరెడ్డికి పది రోజులపాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. అతని టిక్కెట్‌కు కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ వారు రూ.11 వేలు ఆర్థికసాయం చేశారు. దీంతో ఈనెల 12వ తేది ఇండిగో విమానం ద్వారా స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న తెలుగువారి సమస్యలు పరిష్కరించేందుకు ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి మహిళా భక్తులు నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతోపాటు రాహుకాల పూజ విశేషాలను వివరించి చెప్పారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

అఘోర లింగేశ్వరుడికి మాస శివరాత్రి పూజలు

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ ఆవరణలో వెలిసిన శ్రీ అఘోర లింగేశ్వరుడికి మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

డబ్బున్న వారికే బీజేపీలో పదవులా..?



మాట్లాడుతున్న బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ అంజనాచౌదరి

మదనపల్లె : భారతీయ జనతాపార్టీలో డబ్బులున్న వారికే పదవులు లభిస్తాయని, పార్టీని నమ్ముకుని, ఏళ్లుగా కష్టపడ్డవారికి పదవులు రాకపోగా, అవమానాలే మిగులుతాయని బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ అంజనాచౌదరి ఆరోపించారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంటరీ స్థానం బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ పార్టీని నిర్వీర్యం చేసేందుకు కోవర్ట్‌గా మారారని, తన సామాజికవర్గానికి జిల్లా కమిటీలో అధికప్రాధాన్యతను, పదవులను కేటాయిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఇబ్బందిపెట్టేవారే పార్టీలో అధికమయ్యారన్నారు. గతంలో తాను మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేస్తే సొంతపార్టీకి చెందిన వ్యక్తులే తనను నిర్బంధించి బలవంతంగా విత్‌డ్రా చేయించారని వాపోయారు. జరిగిన ఘటనపై అప్పటి పార్టీ అధ్యక్షులు సోమువీర్రాజును కలిసి న్యాయం చేయాలని కోరితే... తనను వేధించిన వారిని పదవుల నుంచి తొలగించారన్నారు. దీనిని మనస్సులో పెట్టుకుని వారు పార్టీ కార్యకర్తల శిక్షణాశిబిరంలో వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తుండగా వీడియోలు తీసి, వాటికి అసభ్య, అభ్యంతరకర క్లిప్పింగ్‌లను జోడించి సోషల్‌మీడియాలో వ్యాప్తి చేసి తనపరువును బజారుకీడ్చిన వైనంపై ఫిర్యాదుచేస్తే తక్షణమే స్పందించి క్రమశిక్షణాచర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరిని కలిసి పార్టీలో మహిళలకు జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదు చేసినా..ఏమాత్రం చర్యలు తీసుకోకపోగా... వేధింపులకు గురిచేసిన వారికే జిల్లా కమిటీలో పదవులు కట్టబెట్టారన్నారు. డబ్బులు ఉన్నాయనే ఒకే ఒక్క కారణంతో పార్టీలో చేరిన రెండేళ్లకే సాయిలోకేష్‌కు జిల్లా అధ్యక్షుడి పదవి కట్టబెట్టారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. తక్షణమే జిల్లాకమిటీలో కార్యదర్శి పదవుల్లో నియమించిన వారిని తొలగించి నూతన కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న, పట్టణ మహిళామోర్చా రమణమ్మ, ప్రధాన కార్యదర్శి మీనా తదితరులు పాల్గొన్నారు.